క్లుప్తంగా

కె.కె.రాజుకు ఎమ్మెల్యే వాసుపల్లి శుభాకాంక్షలు



వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయ కర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయనకు దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.
- డాబాగార్డెన్స్

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతం



సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున స్వామికి సుప్రభాత సేవ నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం వైభవుడి ఆలయం ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని సంప్రదాయ బద్ధంగా జరిపారు. ఆలయ అర్చకులు శేషాచార్యులు, వాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈవో బండారు ప్రసాద్ దంపతులు, అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లలితా పీఠంలో సామూహిక వ్రతాలు

తాటిచెట్లపాలెం: లలితానగర్‌లోని లలితా పీఠంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. కార్తీక మాసం, ఏకాదశి సందర్భంగా ఈ వ్రతాలు చేసినట్లు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శివయ్యకు సహస్ర ఘటాభిషేకం



శివలింగానికి జలాభిషేకం చేస్తున్న అర్చకులు

సీతమ్మధార: కార్తీక మాస బహుళ ఏకాదశి సందర్భంగా శుక్రవారం 24వ వార్డు నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గణపతి పూజ, నవగ్రహ మండపారాధన, అనంతరం సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. ఆలయ ఈవో శేఖర్‌బాబు పర్యవేక్షణలో ఉదయం 10 గంటల నుంచి 1008 బిందెలతో భక్తులు స్వహస్తాలతో శివలింగానికి జలాభిషేకం చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో మృత్యుంజయ హోమం, అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ఆవరణంతా శివ నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ ట్రస్ట్ అధ్యక్షుడు నక్క అప్పారావు రెడ్డి, సభ్యులు, అర్చకులు రామారావు శర్మ, మహేష్, దేవదాయ శాఖ సిబ్బంది శేఖర్, వనజాక్షి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు




ఊరేగింపులో పాల్గొన్న సభ్యులు, మహిళలు

తాటిచెట్లపాలెం: రామకృష్ణనగర్ కళ్లవారితోట శ్రీ గౌరీ సేవా సంఘం కమిటీ ఆధ్వర్యంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్థానికులు, మహిళలు రామకృష్ణనగర్‌లోని రామలింగేశ్వరాలయం నుంచి సారె ఊరేగించారు. మహిళలు చీర, జాకెట్, గాజులు, పసుపు కుంకుమ, పండ్లు, కాయలు, పువ్వులు, స్వీట్లు తీసుకొచ్చి రామకృష్ణనగర్ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా గౌరీపరమేశ్వరుల ఆలయం వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో కాళ్లవారితోట శ్రీ గౌరీ సేవా సంఘం సభ్యులు కాళ్ల సూర్యప్రకాష్, రామలింగేశ్వరాలయ చైర్మన్ బొడ్డేటి కిరణ్, ముక్క కిషోర్, ఉత్సవ కమిటీ సభ్యులు అతికిసెట్టి గంగామహేష్, సరకనం రామారావు, మహిళా భక్త మండలి సభ్యులు కాళ్ల పైడిరాజు, మహాలక్ష్మి, భాగ్యలక్ష్మి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఇది కదా అభివృద్ధి

ఆహ్లాదం.. ఆరోగ్యం





మురళీనగర్ సెక్టార్-8లోని హరిత పార్కులో ఆకట్టుకుంటున్న బుద్ధుడి విగ్రహం

- పచ్చదనంతో కళకళలాడుతున్న హరిత పార్కు
- రూ.22.50 లక్షల నిధులతో ఆధునికీకరణ
- సందర్శకుల కోసం సౌకర్యాల కల్పన
- పార్కు నిర్వాహకులు, స్థానికుల హర్షం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు అవసరమైన ప్రాంతాల్లో పార్కుల అభివృద్ధికి పెద్దపీట వేశారు. ఆహ్లాదం పొందడంతోపాటు ఆరోగ్య పరిరక్షణకు ఉద్యానవనాలు ఎంతగానో దోహద పడుతున్నాయి.



నూతనంగా నిర్మించిన ప్రహరీ

మురళీనగర్: అందమైన.. ఆహ్లాదకరమైన ఉద్యానవనాలకు మురళీనగర్ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది. ఇక్కడి సెక్టార్-8లో చాలా ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని హరిత పార్కును సుందరంగా తీర్చిదిద్ది స్థానికుల్లో ఆనందాన్ని తీసుకొచ్చారు. పేరుకు తగ్గట్టుగానే పచ్చదనంతో ఈ పార్కు సందర్శకులను ఆకర్షిస్తోంది. ఇరవై ఏళ్ల కిందట ఎకరం స్థలంలో హరిత పార్కును ఏర్పాటు చేసి, స్థానికుల విరాళాలతో అభివృద్ధి చేశారు. పార్కులో వాకింగ్ ట్రాక్, బుద్ధుడు, జిరాఫీ బొమ్మలు నిర్మించారు. బ్యాడ్మింటన్ కోర్టు అందుబాటులోకి తెచ్చారు. కళా ప్రాంగణాన్ని తిప్పారెడ్డి, ఇతర కమిటీ సభ్యులు సమకూర్చిన నిధులతో నిర్మించారు.

కార్పొరేటర్ చొరవ..

మురళీనగర్ కొండ ప్రాంతంలో ఓ మూలన ఈ పార్కు ఉండటంతో గతంలో అభివృద్ధికి నోచుకోక సందర్శకులు తక్కువగా వచ్చేవారు. వర్షాలు, తుపాను సమయాల్లో కొండవాలు నుంచి వరద నీరు పార్కు మీదకు వచ్చి పడేది. దాని తాకిడికి పార్కు ప్రహరీ కూలిపోయింది. నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ చొరవ తీసుకుని జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జీవీఎంసీ నిధులతో హరిత పార్కు అభివృద్ధికి, అదనపు సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకున్నారు.

ఇవీ నూతన సౌకర్యాలు..

జీవీఎంసీ సహకారంతో పార్కు నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో హరిత పార్కును ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. బ్యూటిఫికేషన్ చర్యలతో పార్కు మొత్తం అందమైన మొక్కలతో కళకళలాడుతోంది. పార్కు రక్షణకు అవసరమైన ప్రహరీ గోడను జీవీఎంసీ నిధులు రూ.6 లక్షలతో నిర్మించి, కలర్‌ఫుల్‌గా మలిచారు. రూ.1.50 లక్షలతో జీవీఎంసీ ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసింది. పిల్లల కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయించారు. వాకర్స్, పార్కు అభివృద్ధి కమిటీ విజ్ఞప్తుల మేరకు పార్కు అభివృద్ధి పనులకు రెండో విడతగా రూ.15 లక్షల జీవీఎంసీ నిధులు మంజూరు చేశారు. వాటితో 165 మీటర్ల నిడివి గల మట్టితో వాకింగ్ ట్రాక్ నిర్మించారు. కర్బ్ వాల్స్ నిర్మాణంతోపాటు పిల్లల ఆట పరికరాల ఏర్పాటు, అదనంగా జిమ్ ఐటమ్స్ ఏర్పాటు చేస్తారు. గేటుతోపాటు పెయింటింగ్ పనులు చేస్తారు. శ్రీకృష్ణుడి విగ్రహం ఏర్పాటుకు వేదిక సిద్ధమైంది. దీంతో పార్కులో సందర్శకుల తాకిడి.. సందడి పెరిగింది.

వాకింగ్ ట్రాక్‌తో ప్రయోజనం



గతంలో వాకింగ్ ట్రాక్ పాడవడం వల్ల మేం ఇక్కడికి రావడానికి ఇబ్బంది పడేవారం. వేరే పార్కులకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు మట్టితో నిర్మించిన వాకింగ్ ట్రాక్ వల్ల వందలాది మంది వాకర్స్‌కు ప్రయోజనం కలిగింది. సందర్శకులు కూడా పెరిగారు.
- భూపాలరెడ్డి, మురళీనగర్

ప్రతి రోజూ జిమ్ చేస్తాం



ప్రతి రోజూ ఉదయం 7 గంటలకు హరిత పార్కుకు వస్తాం. వాకింగ్ అనంతరం చిన్నపాటి వ్యాయామం తప్పనిసరిగా చేయాలి. ఇందు కోసం ఇక్కడ కనీసం కొన్ని పరికరాలు ఉంటే బాగుండేవి అనుకునేవారం. ఇప్పుడు ఓపెన్ జిమ్ పరికరాలు అందుబాటులోకి రావడంతో జిమ్ చేస్తున్నాం. ఆరోగ్యంగా ఉంటున్నాం.
- కె.బలరామ్, మురళీనగర్ సెక్టార్-4



హరిత పార్కు ముఖద్వారం



మట్టితో తయారు చేసిన వాకింగ్ ట్రాక్



పార్కులో ఓపెన్ జిమ్ పరికరాలు

జీవీఎంసీ నిధులు.. అభివృద్ధి పనులు

- హరిత పార్కు అభివృద్ధికి మంజూరైన నిధులు రూ.22.50 లక్షలు.
- రూ.6 లక్షలతో ప్రహరీ నిర్మాణం.
- రూ.1.50 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు.
- రూ.15 లక్షలతో వాకింగ్ ట్రాక్, అదనపు ఓపెన్ జిమ్, పిల్లల ఆటపరికరాలు, ఇతర అభివృద్ధి పనులు.

కార్పొరేటర్ సహకారంతో పార్కు అభివృద్ధి



కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, స్థానిక నాయకుల సహకారంతో పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. మేము అడిగిన వెంటనే జీవీఎంసీ నిధులు మంజూరు చేయించి పార్కు కొత్త రూపు తీసుకొచ్చేందుకు సహకరించిన కార్పొరేటర్ ప్రసాద్‌కు మా కృతజ్ఞతలు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న సమస్యలు పరిష్కారమయ్యాయి.
- పిల్లా కొండలరావు, అధ్యక్షుడు, హరిత పార్కు

నేటి నుంచి సంకల్ప యాత్ర ప్రచారం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రచార కార్యక్రమం ఈఈసీ ప్రచార రథం ద్వారా 40 రోజుల పాటు నిర్వహించనున్నామని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. తొలి విడత ఈ నెల 9 నుంచి 14 రోజుల పాటు ఉంటుందన్నారు.

కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: షాలిమర్‌లో శుక్రవారం బయలుదేరాల్సిన షాలిమర్-చెన్నై సెంట్రల్(12841) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ పెయిరింగ్ రైలు ఆలస్యంగా నడుస్తున్నందున రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

ఐక్య పోరాటంతోనే హక్కుల సాధన



వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం తదితరులు

సీతమ్మధార: బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కలిసికట్టుగా పనిచేయాలని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం పిలుపునిచ్చారు. రాజ్యాంగపరంగా రావాల్సిన హక్కుల కోసం యువత పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ 40 వసంతాల(రూబీ జూబ్లీ) వేడుకల్లో భాగంగా శుక్రవారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ భవన్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతాయుతంగా పనిచేస్తేనే హక్కులు సాధించగలమన్నారు. మాజీ వీసీ, యూపీఎస్సీ మాజీ చైర్మన్ ఆచార్య కె.ఎస్.చలం మాట్లాడుతూ దేశంలో మూడు అగ్రకులాలే ఆధిపత్యం, అధికారం చెలాయిస్తున్నాయన్నారు. పెట్టుబడుదారులే వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో ఉద్యమాలకు నాయకత్వం వహిస్తోంది దళితులు, ఆదివాసులేనని తెలిపారు. 90 శాతం మంది దళితులు ఉపాధి అవకాశాలు లేకుండా ఉన్నారన్నారు. అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణ్‌రావు మాట్లాడుతూ 40 ఏళ్ల అంబేడ్కర్ భవన్ అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ భవన్ కార్యదర్శి జీవీ ప్రభాకర్, సత్యనారాయణ, ఆచార్య పి.డి.సత్యపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం, డాక్టర్ జయరాజ్, భవనం వ్యవస్థాపకుడు రాజారావు, ఐఆర్‌ఎస్ అధికారి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సుపరిపాలన



53వ వార్డులో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న బర్కత్ అలీ, గుజ్జు వెంకటరెడ్డి



51వ వార్డులో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న రెయ్యి వెంకటరమణ తదితరులు

మద్దిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సుపరిపాలన సాధ్యమని 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ అన్నారు. నరేంద్రనగర్ సచివాలయం వద్ద శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం నిర్వహించారు. 295, 296 సచివాలయాల పరిధిలో నరేంద్రనగర్, శివనగర్, పార్వతీనగర్, శ్రీరాంనగర్, గ్రీన్ గార్డెన్స్, జాకీర్ హుస్సేన్‌నగర్, ఆంధ్రకేసరినగర్ సచివాలయాలకు సంబంధించి కార్పొరేటర్ డిజిటల్ బోర్డును ఆవిష్కరించి, వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి మాట నిలబెట్టుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. 2024లో మళ్లీ ముఖ్యమంత్రిగా ఆయనే కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ డైరెక్టర్ గుజ్జు వెంకటరెడ్డి, పార్టీ నాయకులు షేక్ బాబ్జి, హనుమంతు, సుశీల, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం

జీవీఎంసీ 51వ వార్డు కళింగనగర్ 289 సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న జగనన్నను రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ గెలిపించుకుందామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టారు, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్ రెడ్డి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీను, పొన్నాడ అప్పారావు మాస్టారు, బి.తిరుమలరావు, మెట్ట దమయంతి, కరిమిరెడ్డి శ్యామ్, వై.వరలక్ష్మి, రాణి, గణేష్, రామ్మోహన్, చిన్ని, సాధు, సీవో భాస్కర్, ఆర్పీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ రావాలి

మురళీనగర్: రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి జరగాలంటే జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని 49వ వార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం వార్డులోని మాణిక్యాంబ కాలనీ 1086282 సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పరిపాలనను వివరించారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని, అర్హులందరికీ సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ ఫలాలు నేరుగా అందిస్తున్నారన్నారు. అందుకే మళ్లీ జగనన్నే గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ముందుగా వైఎస్సార్‌సీపీ జెండాను అల్లు శంకరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర భట్రాజుల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎ.రవికుమార్, విశాఖ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ ఐ.రవికుమార్, వార్డు సీనియర్ నాయకులు ఎ.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, వార్డు మహిళా సీనియర్ నాయకులు బి.సరస్వతి, వి.కమలకుమారి, సచివాలయ కన్వీనర్లు సుబ్బలక్ష్మి, పి.చైతన్య, వార్డు నాయకులు అచారి, ఏసుబాబు, కె.మున్నా, బి.శంకర్, సిహెచ్.శ్రీను, శంకర్ పాల్గొన్నారు.



49వ వార్డులో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న అల్లు శంకరరావు

వైభవ వేంకటేశ్వరుడిని దర్శించుకున్న కె.కె.రాజు

మురళీనగర్: వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు తన పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వైభవుడి సుప్రభాత సేవలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావుతో కలిసి పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక అర్చకులు ఆయనకు ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా కె.కె.రాజును ఆలయ ఈవో బండారు ప్రసాద్, అల్లు శంకరరావు భారీ జగమాలతో ఘనంగా సత్కరించారు.



కె.కె.రాజును సత్కరిస్తున్న ఈవో ప్రసాద్, అల్లు శంకరరావు

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న కంపా హనోకు, పైడి రమణ

తాటిచెట్లపాలెం: వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయ కర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు జన్మదిన వేడుకలు పార్టీ 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జగన్నాథపురం ప్రియదర్శిని వృద్ధుల ఆశ్రమంలో ముఖ్య అతిథి కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు చేతుల మీదుగా కేక్ కట్‌చేశారు. వృద్ధులకు మధ్యాహ్నం అన్నదానం జరిపారు. ఆశ్రమ వృద్ధులు కె.కె.రాజు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నాయకులు హరిపట్నాయక్, నాని బాబు, ఆదిలక్ష్మి, రాజుయాదవ్, నాయుడు, దుర్గేష్, బాబూరావు, ఈశ్వరరావు, పైడి నాగరాజు, నరసా రావు, శ్యామ్, తవుడమ్మ, సువర్ణ, 55వ వార్డు నాయకుడు దుప్పలపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణపురంలో..

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు జన్మదినం సందర్భంగా 46వ వార్డు కైలాసపురం లక్ష్మీనారాయణపురంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ చేతుల మీదుగా అన్నసమారాధన నిర్వహించారు. కో-ఆప్షన్ సభ్యుడు అప్పారావు, కె.చిన్నా, ఈశ్వరరావు, అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



46వ వార్డులో అన్నదానం చేస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

➡ బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయం వద్ద జరిగిన జన్మదిన వేడుకల్లో కె.కె.రాజుకు నెడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్ ధర్మాల ఆనంద్‌కుమార్‌రెడ్డి, 54వ వార్డు కార్పొరేటర్ చల్లా రజిని శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛాలు అందించారు.

మద్దిపాలెం: వైఎస్సార్‌సీపీ ఉత్తర కార్యాలయం వద్ద కె.కె.రాజుకు 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మెట్ట దమయంతి, బి.తిరుమలరావు, కరిమిరెడ్డి శ్యామ్, వై.వరలక్ష్మి, రత్నం, గణేష్, రాణి, వినోద్, బాబూరావు పాల్గొన్నారు.

టెక్నికల్ స్కిల్స్‌తో ఐటీ రంగంలో ఉద్యోగాలు



మనోజ్‌కు మొదటి బహుమతిగా నగదు అందజేస్తున్న డాక్టర్ సురేష్ బాత

సీతమ్మధార: ఐటీ రంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ టెక్నికల్ స్కిల్స్‌పై దృష్టి పెట్టాలని డాక్టర్ సురేష్ బాత(అడిషనల్ డైరెక్టర్ అండ్ ఐటీసీఎస్‌టీపీఎల్) సూచించారు. మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ 24వ వార్షికోత్సవం సందర్భంగా మిలీనియం అప్టిట్యూడ్ టెస్ట్(మ్యాట్-2023) మెరిటోరియస్ స్కాలర్‌షిప్ పరీక్షలో విజయం సాధించిన వారికి శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నగదు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగా ఐటీ రంగంలో ఉద్యోగాలు పొందాలంటే కష్టతరంగా మారిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతిక శిక్షణ చాలా అవసరమన్నారు. స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్, గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజా పప్పు మాట్లాడుతూ కంప్యూటర్ నాలెడ్జి ఉంటే అన్నీ రంగాల్లో రాణించవచ్చన్నారు. డాక్టర్ వి.ఎస్.కృష్ణ డిగ్రీ కళాశాల సీఎస్‌ఈ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ వై.జాహ్నవి మాట్లాడుతూ నేడు కంప్యూటర్ లిటరసీ లేకపోతే నిరక్షరాస్యులు అంటున్నారన్నారు. స్కాలర్‌షిప్ పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థుల వివరాలను మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సెంట్రల్ మేనేజర్ వి.రవికుమార్ ప్రకటించారు. మొదటి బహుమతి సాధించిన సిహెచ్.మనోజ్(గీతం యూనివర్సిటీ)కు రూ.50 వేల నగదు అందజేశారు. రెండో బహుమతిగా జి.వి.వి.ఎస్.మధులత(ఆంధ్రా యూనివర్సిటీ)కు ల్యాప్‌టాప్, మూడో బహుమతిగా ఆర్.అర్జునరావు(బాలాజీ కళాశాల)కు ట్యాబ్, నాలుగో బహుమతిగా ఎస్.సంతోష్‌కుమార్(సీతం కళాశాల)కు వాచ్, ఐదో బహుమతిగా ఎస్.సంతోష్‌కుమార్(బాలాజీ కళాశాల)కు బ్యాగ్‌ను అందజేశారు. సంస్థ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదాతకు సర్టిఫికెట్ అందిస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథి మేయర్ గొలగాని హరివెంకటకుమారి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. రక్తదానం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. బ్యాంక్ అధికారులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా తమ శాఖల్లో సీఎస్‌ఆర్ సేవల్లో భాగంగా 15వ ఏడాది విశాఖలోని సర్కిల్ శాఖలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందించారు. బ్యాంక్ సర్కిల్ హెడ్‌లు లంకా మణికంఠ శర్మ, విశ్వనాథ్ పాల్గొన్నారు.

కేకేఆర్ ట్రోఫీ బాక్సింగ్ పోటీలు ప్రారంభం

తాటిచెట్లపాలెం: వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు జన్మదినం సందర్భంగా శుక్రవారం విశాఖ డిస్ట్రిక్ట్ అమెట్యూర్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరుసగా మూడో ఏడాది జిల్లా మెన్స్, వుమెన్స్ సబ్ జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్-2023 కైలాసపురం పోర్టు హాస్పిటల్ ఎదురుగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 10 వరకు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథి జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ కేకేఆర్ ట్రోఫీ బాక్సింగ్ పోటీలను ప్రారంభించారు. ఫైనల్ విజేతకు కె.కె.రాజు చేతుల మీదుగా ట్రోఫీని అందించనున్నట్లు ఆర్గనైజర్ నీలి రవి, నిర్వాహకులు మామిడి శ్రీను, ఎన్‌టీఆర్ రెడ్డి, బులుసు జగదీష్ తెలిపారు. కార్యక్రమంలో ద్రోణంరాజు అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వర్లు, ఏపీ స్టేట్ బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ లక్ష్మణ్‌దేవ్, ఆర్‌వోసీ సెక్రటరీ బి.నాగేశ్వర్, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, పి.ఉషశ్రీ, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాస్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

5 కిలోల గంజాయి స్వాధీనం

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు అప్పగించారు. వివరాలిలా.. రైల్వే న్యూకాలనీ వద్ద అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద ఐదు కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించిన పోలీసులు మూడు సెల్ ఫోన్‌లు, ఐదు కిలోల గంజాయి స్వాధీన పరుచుకుని ఫోర్త్ టౌన్ పోలీసులకు అప్పగించారు.

మల్లంపల్లి సేవలు ప్రశంసనీయం

మహారాణిపేట: ప్రఖ్యాత చరిత్రకారుడు, శాసన పరిశోధకుడు మల్లంపల్లి సోమశేఖర శర్మ జయంతి వేడుకలు మల్లంపల్లి సోమశేఖర శర్మ చారిత్రక అధ్యయన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ద్వారకానగర్ బీవీకే కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆంధ్ర విశ్వవిద్యాలయం చరిత్ర, పురావస్తు శాస్త్ర రిటైర్డ్ ఆచార్యుడు సిహెచ్.సోమసుందరరావు మాట్లాడుతూ అజరామరమైన చరిత్రకు మల్లంపల్లి సోమశేఖర శర్మ చేసిన సేవ విశిష్టమైందన్నారు. సంస్థ చైర్మన్, ఏయూ చరిత్ర, పురావస్తు శాస్త్ర రిటైర్డ్ ఆచార్యుడు కొల్లూరు సూర్యనారాయణ మాట్లాడుతూ సోమశేఖర శర్మ ఒక్క చరిత్రలోనే కాకుండా సాహితీవేత్తగా, శాసన పరిశోధకుడిగా, లిపి కర్తగా, పత్రిక సంపాదకుడిగా అనేక రంగాల్లో సేవలందించిన బహుముఖ ప్రజ్ఞాశాలని కొనియాడారు. బీవీకే కాలేజీ ప్రిన్సిపాల్ రమ ఆచంట మాట్లాడుతూ చరిత్రతోపాటు మిగిలిన ఆర్ట్స్ విభాగపు సబ్జెక్టులకు పూర్వ వైభవం తెచ్చేలా కళాశాలలో కృషి చేయాలని సూచించారు. విశిష్ట అతిథి ఇంటెక్ మెంబర్ ఎడ్వర్డ్ పాల్ మాట్లాడుతూ చరిత్రకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు మల్లంపల్లి సోమశేఖర శర్మ చారిత్రక అధ్యయన సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సంస్థ కార్యదర్శి శంకర్ నీలు భాగవతుల సంస్థ ఆశయాలను, ఇప్పటివరకు చేసిన కార్యక్రమాలను వివరించారు. చరిత్రకారుడు కె.ఎస్.కామేశ్వరరావు వేంగీ చాళుక్యులపై రాసిన పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ సోమసుందరరావు తదితరులు

ఉత్తమ అధ్యాపకుడికి సత్కారం

మురళీనగర్: రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడి అవార్డు గ్రహీత, కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఎలక్ట్రికల్ విభాగం సీనియర్ లెక్చరర్ కేవీఎస్ఎస్ రావును శుక్రవారం కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ఇతర అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది సత్కరించారు.



కేవీఎస్ఎస్ రావును సత్కరిస్తున్న గైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ తదితరులు